ప్రజాశక్తి
బుధవారం 26 నవంబర్ 2025
5
విజయనగరం

ఇళ్ల నిర్మాణాలకు 30లోగా దరఖాస్తు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఇల్లు లేని పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందనికలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని గ్రామాల్లో అర్హత ఉండి ఇల్లు లేని నిరుపేదల కోసం 100శాతండిమాండ్ సర్వే జరుగుతోందనీ తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఈనెల 30 వరకు మాత్రమే గడువు ఉందని, అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాబోయే 5 సంవత్సరాలలో ఎవరికైనా పక్కా ఇల్లు కావాలంటే, తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉండి, సొంత స్థలం ఉన్నా లేకపోయినా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సచివాలయం పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేదా మండల హౌసింగ్ సహాయక ఇంజనీర్‌ను సంప్రదించాలని సూచించారు.

పండుగలా పుస్తక మహోత్సవం

- పులకించిన పుస్తక ప్రియులు
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లా పుస్తక మహోత్సవం పండగ వాతావరణంలో ప్రారంభమైంది. పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ వేడుకలను కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసిన వేలాది పుస్తకాలను చూసి పుస్తక ప్రియుల మనస్సు పులకించింది. సాహిత్య సభలు, కవి సమ్మేళనాలు సాహిత్య ప్రియులను ఓలలాడించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన సైన్సు ప్రయోగాలు అందరినీ అలరింపజేశాయి.

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఎపి సాంస్కృతికశాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేవారు. పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, పుస్తక మహోత్సవం కన్వీనర్ ఎస్. మురళీమోహన్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి, ఎస్పి ఎస్వి మాధవరెడ్డి పుస్తక ప్రదర్శనను తిలకించారు. హాజరైన శ్రీజన్ పాఠశాల విద్యార్థినులతో కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ముచ్చటించారు. మన్యం గడ్డపై తొలిసారి పుస్తక మహోత్సవం ప్రారంభం కావడంతో సాహితీ ప్రియులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శన చూసి పరవసించి పోయారు. విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక, సాహితీ రంగాలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉండడంతో ఆనందం వ్యక్తం చేశారు. అన్ని రంగాలకు చెందిన పుస్తకాలు ఒకే చోట లభ్యమవడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయింది. వంద ప్రచురణ సంస్థలకు చెందిన లక్ష పుస్తకాలు ఈ ప్రదర్శన లో అందుబాటులో ఉన్నాయి. పుస్తకం నుంచి పూర్తిగా దూరమై మనుషులు స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్న తరుణంలో ఇలాంటి పుస్తక మహోత్సవం ప్రారంభించిన తొలిరోజే విశేష స్పందన లభించింది.

పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

సాహితీ వేత్తలకు పుట్టినిల్లు : కలెక్టర్

పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ సాహితీవేత్తలకు పుట్టినిల్లు మన్యం జిల్లా అని పేర్కొన్నారు. ఇక్కడ ఎక్కువ మంది కవులు, సాహితీవేత్తలు, రచయితలు ఉండటం గర్వకారణమని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సహజ సిద్ధమైన సాహిత్య, సాంస్కృతిక వాతావరణం ఉందని, ఇక్కడ గొప్ప కవులు, రచయితల లక్షణాలు మెండుగా ఉన్నాయని అన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు, అన్ని రంగాలకు చెందిన వారి వివరాలను సేకరించి ఒక డైరీని రూపొందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో వారికి ఆహ్వానాలు పంపడానికి, వారిని కలుపుకుపోవడానికి వీలవుతుందని అన్నారు. రాబోయే 10 రోజుల పాటు జరిగే ఈ పుస్తక మహోత్సవాన్ని, సాహిత్య సభలను ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం థింసా నృత్యం చేసిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను ఎస్పీతో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఎస్పి ఎస్.వి.మాధవ్ రెడ్డి మాట్లాడుతూ అందరిలో ఆలోచన శక్తి పెరగాలంటే పుస్తక పఠనం తప్పనిసరి అని అన్నారు. పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయడం వల్ల వారిలో హేతుబద్ధమైన ఆలోచన పెరుగుతుందని, మంచి, చెడులను ఆలోచించే శక్తి వస్తుందన్నారు. ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు, ప్రముఖ కవి, కళాకారుడు రౌతు వాసుదేవరావు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీతలు బెలగాం భీమేశ్వరరావు, నారంశెట్టి ఉమామహేశ్వర రావు, పక్కి రవీంద్రనాథ్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ పాల్గొని పుస్తక పఠనం ద్వారా లభించే సృజనాత్మకతను వివరించారు.

నృత్యం చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

అలరించిన థింసా నృత్యం

విప్లవ గాయకుడు వంగపండు ప్రసాదరావు, రచయిత బోనం నాగభూషణం, సినీ గేయ రచయిత గణేష్ పాత్రో పేరిట ఏర్పాటు చేసిన సాహిత్య, సాంస్కృతిక వేదికపై జిల్లా కలెక్టర్, ఎస్పి, కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు సహా అతిథులు ఆశీనులయ్యారు. గిరిజన మహిళా ఉపాధ్యాయులు చేసిన థింసా నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. వీటితో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సాహితి లహరి మంచుపల్లి శ్రీరాములు, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు, డివిఇఒ వై.నాగేశ్వరరావు, సామాజిక వేత్త జట్టు పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానామృత సాగరంలా పుస్తక మహోత్సవం

పార్వతీపురంలో ప్రారంభమైన పుస్తక మహోత్సవం జ్ఞానామృత సాగరంలా ఉంది. ఒకే చోట వంద ప్రచురణ సంస్థల పుస్తకాలు దొరకడంతో పుస్తక దాహార్తి తీరింది. మనిషి మేధస్సు వికసించాలన్నా, సృజనాత్మకత బయటకు రావాలన్నా పుస్తకం చాలా అవసరం. ప్రతి ఇంటిలో వంట గది వున్నట్లే పుస్తకాలకు ఓ గది వుండాలి. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి. స్మార్ట్ ఫోన్ వినియోగంలోకి వచ్చిన తర్వాత పుస్తకాలను దూరం పెట్టారు. గ్రంథాలయం లేని ఊరు వెనుకబడినట్లే పెద్ద పెద్ద మేడలున్నంత మాత్రాన ఆ ఊరు అభివృద్ధి చెందినట్లు కాదు.

గంటేడ గౌరు నాయుడు, కవి, రచయిత

గాజు పెంకులపై నిల్చొన్న విద్యార్థి

ఆకట్టుకున్న జెవివి ప్రదర్శనలు

మన్యం పుస్తక మహోత్సవం లో భాగంగా తొలిరోజు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢనమ్మకాలపై నిర్వహించిన పలు ప్రదర్శనలు విద్యార్థులను విశేషం గా ఆకట్టుకున్నాయి.గాజు పెంకులపై విద్యార్థులు చెప్పు లేకుండా నడవడం, మేకులు వున్న కుర్చీలో కూర్చోవడం వంటి ప్రయోగాలు విద్యార్థుల సృజనాత్మకత వెలికి తీయడానికి దోహదపడ్డాయి

జాతీయ పోటీలకు ఎంపికైన రాష్ట్ర జట్టు క్రీడాకారులు

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 22,23,24 తేదీల్లో ఉత్తరప్రదేశ్ అయోధ్యలో జరగనున్న అండర్ 17 బాలికలు జాతీయ ఖోఖో పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టును పరిశీలకులు ప్రకటించారు. మూడు రోజుల పాటు విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర పోటీల్లో బాగా ఆడిన వారిని సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది. అందులో తూర్పుగోదావరి నుంచి డి.నందిని, డి.సత్యవతి, ఎం కృష్ణవేణి, చిత్తూరు జిల్లా నుంచి జి.దివ్య, సత్యవతి, విజయనగరం నుంచి ఎం.ధనలక్ష్మి, ఎం.అనిత, విశాఖపట్నం నుంచి నవ్య, శ్రీకాకుళం నుంచి ఎం.హారిక, గుంటూరు నుంచి ఎం.రంగ మహాలక్ష్మి, కృష్ణా జిల్లా నుంచి ఎన్.నిహారిక, కర్నూలు నుంచి హేమలతను ఎంపిక చేసి 12 మంది క్రీడాకారులతో జట్టును ప్రకటించారు. ఈ జట్టుకు స్టాండ్ గర్ల్స్‌గా గుంటూరు నుంచి జి.నిత్యశ్రీ, చిత్తూరు నుంచి సి.అమృత, శ్రీకాకుళం నుంచి ఎస్.తేజశ్రీ, తూర్పు గోదావరి నుంచి పి.సంధ్య, విశాఖపట్నం నుంచి జ్యోష్ణను ప్రకటించారు.

మూడో స్థానంలో విజయనగరం

విజ్జీ స్టేడియంలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన 69 వ అండర్ 17 బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో విజేతగా తూర్పుగోదావరి జిల్లా జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో చిత్తూరు జిల్లా జట్టు, తృతీయ స్థానంలో విజయనగరం జిల్లా జట్టు నిలిచాయి. మూడు, నాలుగు స్థానాలకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల జట్లు మధ్య జరిగిన పోటీలో రెండేసి పాయింట్లు సాధించి టైగా నిలవడంతో టాస్ ద్వారా విజేతను ప్రకటించారు. అనంతరం బహుమతులు ప్రదాన కార్యక్రమానికి డిఇఒ యు.మాణిక్యం నాయుడు, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, సీనియర్ ఖో ఖో క్రీడాకారులు ఎవిఎన్, పోస్టల్ కబడ్డీ జట్టు రాష్ట్ర కోచ్ పి.శ్రీనివాసరావు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాంబాబు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. విజేతగా జట్టును నిలపడం లో ఆల్ రౌండ్ ప్రదర్శన చేసిన తూర్పుగోదావరి జట్టు క్రీడాకారిణి నందినికి పోస్టల్ కబడ్డీ కోచ్ పి.శ్రీనివాసరావు వెయ్యి రూపాయలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ రాష్ట్ర పోటీలను విజయవంతం చేసిన స్కూల్ గేమ్స్ కార్యదర్శులను, వ్యాయామ ఉపాధ్యాయులను, సహకరించిన క్రీడా సంఘాల నాయకులను అభించందించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ విజయనగరంలో ఖోఖో బాలికల పోటీలు ఇక్కడ నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. పోటీలకు పరిశీలకులుగా ఎం.సుబ్బారావు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు సంఘం నాయకులు ఎల్ వి రమణ, ఎన్.వెంకటనాయుడు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రెడ్డి శంకరరావు

టెట్‌పై పార్లమెంట్‌లో చర్చించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహించనున్న టెట్ పరీక్షలపై పార్లమెంట్‌లో చర్చించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం యుటిఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెట్ పరీక్షపై ఇప్పటికే చాలా రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేసినప్పటికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేస్తామని చెప్పి ఇప్పటికి వేయలేదని, ఇప్పటికైనా వేయాలని కోరారు. విద్యారంగ, ఉపాధ్యాయులు సమస్యలపై జాతీయ స్థాయిలో ఉద్యమాలు చేపడతామన్నారు. విద్యారంగ సమస్యలపై డివిజన్ కేంద్రాల్లో డిసెంబర్ 9,10 తేదీలలో నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. డిసెంబర్ 18న జిల్లా కేంద్రంలో, జనవరి మొదటి వారంలో రాష్ట్ర స్థాయిలో నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జనవరి 29న ఎన్ఇపి రద్దు చేయాలని, టెట్ పరీక్షను విరమించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దశలవారీ పోరాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, రమేష్, సత్యన్నారాయణ, సుధాకర్, శంకరరావు, చిట్టిబాబు, చంటి, త్రినాథ్, అనంతరావు, శ్రీనివాస్, అప్పలనాయుడు, రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్దాలి

జెఎన్‌టియు జివి విసి సుబ్బారావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్దాలని జెఎన్‌టియు జివి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వివి సుబ్బారావు సూచించారు. జెఎన్‌టియులో మంగళవారం ఉత్తరాంధ్ర ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ, విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రత్యక్ష ప్రాయోగిక అనుభవం, పరిశ్రమలో విద్యా సంస్థల భాగస్వామ్యం బలోపేతం చేయడం, కనీసం రెండు నెలల శిక్షణా కార్యక్రమాలు (ఇంటర్న్‌షిప్‌లు) అమలు చేయడం అవసరమన్నారు. ఫార్మసీ రంగంలో జరుగుతున్న వేగవంతమైన మార్పులను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ మేధస్సు పాఠ్యాంశాలు, అదనపు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టడం అత్యంత ముఖ్యమని చెప్పారు. విద్యార్థులు ఉద్యోగావకాశాలను సులభంగా పొందే విధంగా శిక్షణ కల్పించాలన్నారు. పలువురు ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ అర్హత కలిగిన అధ్యాపకులకు పరిశోధన పర్యవేక్షకులుగా సేవలందించే అవకాశాలను కల్పించాలని కోరారు. పి.హెచ్.డి. చేయడానికి పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నందున, దీనిపై విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో విసితోపాటు వైస్‌ఛాన్సలర్ జయసుమను సత్కరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 25 మందికి జరిమానా

ఇద్దరికి జైలు శిక్ష

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మంది నిందితులకు రూ.10వేలు చొప్పున జరిమానా , ఇద్దరు నిందితులకి 5 రోజులు జైలుశిక్ష విధిస్తూ విజయనగరం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి, విజయనగరం స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ్‌కోర్టు) శ్రీవిద్య మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పి ఎఆర్ దామోదర్ తెలిపారు. విజయనగరం పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం సేవించి, వాహనాలు నడిపిన 18 మంది వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 18మందిని విజయనగరం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా 17మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా, ఒక నిందితుడికి 5రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పి తెలిపారు. విజయనగరం రూరల్ స్టేషన్ పరిధిల్లో రూరల్ పోలీసులు ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం సేవించి, వాహనాలు నడిపిన 9 మంది వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. 8 మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా, ఒక నిందితుడికి 5 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పి తెలిపారు.

బిఎల్ఎలను నియమించండి : డిఆర్ఒ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాజకీయ పార్టీలు ప్రతీ పోలింగ్ బూత్‌కు తమ ప్రతినిధిగా ఒక ఏజెంట్‌ను (బిఎల్ఎ) నియమించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి సూచించారు. తమ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించి, వారినుంచి పలు సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ గతంలో అదే వార్డుకు చెందిన వ్యక్తిని మాత్రమే బిఎల్ఎగా నియమించే అవకాశం ఉండేదని, తాజాగా దానిని ఎన్నికల కమిషన్ సవరించిందని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని వ్యక్తులను అదే నియోజకవర్గంలో ఎక్కడైనా బిఎల్ఎగా నియమించుకొనే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించిందని డిఆర్ఒ తెలిపారు. బిఎల్ఎను నియమించడం ద్వారా ఒక వ్యవస్థీకృత యంత్రాంగం ఏర్పాటవుతుందని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో15,72,464 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఎప్పుడైనా దరఖాస్తు చేయవచ్చునని సూచించారు. నిర్ణీత సమయంలో వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు ప్రస్తుతం జిల్లాలో 1847 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా మరో 122 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని వివరించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కుటుంబరావు (టిడిపి) శ్రీనివాసరెడ్డి (వైసిపి), తమ్మినేని సూర్యనారాయణ (సిపిఎం) శ్రీనివాసరావు (కాంగ్రెస్) పైల రమేష్‌రాజు (ఆప్), అప్పారావు (బిజెపి), సోములు (బిఎస్‌పి) పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరి పైన ఉందనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ సంయుక్త నిర్వహణలో చేపడుతున్న 4 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ విజయనగరం సాధన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా కో ఆర్డినేటర్ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కమిషనర్ పల్లి నల్లనయ్య పలు ప్రాంతాల్లో పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య విధానాన్ని గమనించారు. అన్న క్యాంటీన్ ను సందర్శించారు.

సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్

37, 38 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది కార్యదర్శులను మందలించారు. ఇటువంటివి పునరావతమైతే విధుల నుంచి తొలగించి వస్తామని స్పష్టం చేశారు.

లేఖ రాయండి.. నగదు గెలవండి

తపాలా శాఖ వినూత్న ప్రచారం
లేఖల రాత పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు

ప్రజాశక్తి - గజపతినగరం

మారుతున్న కాలం, పెరుగుతున్న టెక్నాలజీ కారణంగా లేఖలు రాయడం బాగా తగ్గిందని, పిల్లలు సైతం చిన్నప్పటి నుంచి చరవాణిలకు అలవాటు పడుతున్న తరుణంలో లేఖల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వనున్నట్లు గజపతినగరం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర మంగళవారం ప్రజాశక్తికి తెలిపారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో డాయి అఖర్ పేరుతో లేఖ రాత పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. లెటర్ టు మై రోల్ మోడల్ అనే థీమ్‌ను ప్రకటించామన్నారు.ఈ పోటీల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ లేఖలు రాసిన వారికి మొదటి బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు నగదు బహుమతులు ఇస్తామన్నారు. సర్కిల్ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు ఇస్తామన్నారు. లేఖలను తెలుగు, హిందీ, ఇంగ్లీష్ ఏ భాషలో అయినా రాయొచ్చు అని అన్నారు. ఇన్లాండ్ లెటర్ కార్డ్ మీద రాసేవారు 500 పదాలకు మించకుండా రాయాలని ఎన్వలప్ మీద వెయ్యి పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ పోటీలను 18 ఏళ్ల లోపు, 18 ఏళ్ల దాటి ఇలా రెండు కేటగిరీలను విభజించామని అన్నారు. లేఖలు రాయడానికి చివరి తేదీ డిసెంబర్ 8 అని తెలిపారు. లేఖలను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసు, విజయనగరం డివిజన్ వారికి పంపించాలని అన్నారు. డాయి అఖర్ పేరుతో తపాలా శాఖ నిర్వహిస్తున్న ఈ లేఖల పోటీలను విద్యార్థులు, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. జాతీయ, సర్కిల్ స్థాయిలో నగదు బహుమతులు ఉండటం వల్ల అందరూ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఇప్పటికే పాఠశాలల్లో దీని గురించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మంగళవారం హర్షవర్ధన పాఠశాలలో ప్రచారం చేపట్టినట్లు తెలిపారు.

హర్షవర్ధన పాఠశాలలో ప్రచారం చేస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర

వైసిపి నాయకులవి అసందర్భ వ్యాఖ్యలు

ఎయిర్‌పోర్టు పనులు వారే ప్రారంభించినట్లు ప్రగల్భాలు
టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరంకోట

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు నాగార్జున

వైసిపి నాయకులు ఇటీవల కాలంలో అసందర్భంగా మాట్లాడుతూ ప్రజలను తప్పతోవ పట్టిస్తున్నారని, భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు వారే ప్రారంభించినట్లు ప్రగల్భాలు పలుకుతున్నారని టిడిపి విజయనగరం పార్లమెంట్ స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలు ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు పెడితే ఎంతో ఉపయోగం ఉంటుందని తమ నాయకుడు చంద్రబాబునాయుడు ఆలోచన చేస్తే అదేదో జగన్ చేసినట్లు వైసిపి నాయకులు చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. కార్గో టూరిజం పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి జరిగితే ఉపాధి వ్యాపార అవకాశాలు దొరుకుతుందని చంద్రబాబు ఆలోచన చేశారన్నారు. వైసిపి నాయకులు 23శాతం అభివృద్ధి చేశారంటూనే మిగతాది ఆటోమేటిక్‌గా అయిపోతుందని చెప్పడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వానికి శ్రద్ధ ఉంటే ఐదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. 2015 అక్టోబర్‌లో జగన్మోహన్ రెడ్డి భోగాపురం వచ్చి ఇక్కడ ఎయిర్‌పోర్టు ఎందుకు అని అన్నారని చెప్పారు. విశాఖపట్నం నేవీ ఎయిర్‌స్ట్రిప్ 980 ఎకరాలు ఉంది చుట్టుపక్కల 1000 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది దాన్ని తీసుకోవచ్చు కదా అని చెప్పిన జగన్మోహన్ రెడ్డి ఈరోజు భోగాపురం ఎయిర్‌పోర్ట్ 23శాతం పనులు తామే చేశాం అనడం ఎంతవరకు సమంజసమని అన్నారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కోదండరాం, విజయనగరం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు పాల్గొన్నారు.

రామకృష్ణానగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

33వ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం 29వ వార్డు పరిధి రామకృష్ణ నగర్‌లో కాలువలు, రోడ్లు వేయాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. మంగళవారం 33వ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈసందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ రామకృష్ణ నగర్‌లో మారు 135 మంది నివాసం ఉంటున్నారని, వీరికి రోడ్లు, కాలువలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వర్షం వస్తే ముంపునకు గురవుతున్నారని అన్నారు. తుపాన్లు వచ్చినపుడు అధికారులు వచ్చి ఇళ్లలోకి వచ్చే నీటిని పరిశీలించి వెళ్లిపోవడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. పేదల పట్ల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం రామకృష్ణ నగర్ అని అన్నారు. .అలాగే చెట్లు పెరిగి కరెంటు స్థంభాలకు తాకి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. చెట్టు కొమ్మలను కొట్టించాలని కోరారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడం వల్ల డయేరియా, మలేరియా వచ్చే ప్రమాదం ఉందని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. జగదాంబ, నగర వాసులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో జిల్లాకు బంగారు పతకాలు

**విజయనగర

అన్నదాతకు లబ్ధి చేకూర్చేందుకే 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి - వంగర

అన్నదాతకు లబ్ధి చేకూర్చేందుకే రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మండలంలోని కింజంగి గ్రామంలో మంగళవారం 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. రైతు సేవా కేంద్రంలో పనిచేసే అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు ఆరుగురు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి రైతుల సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు లచ్చుబుక్త కృష్ణమూర్తి, పిన్నింటి మోహనరావు, మజ్జి గణపతి, బెజ్జిపురపు రవి, బలిజిరెడ్డి శ్రీను, బొరోతు రాంబాబు, డిఎల్‌డిఒ హేమ సుందరరావు, ఎఒ కన్నబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్

దెంకాడ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పెదతాడివాడ గ్రామంలో మంగళవారం 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొని కరపత్రాలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంది చంద్రశేఖర రావు, ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, తహశీల్దార్ నమ్మి రాజారావు, ఎఒ సంగీత, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, కలిదిండి పాణీరాజు, పడాల చిన్నారావు, అబోతుల ప్రవీణ్, కోరాడ వెంకటరమణ, బుజ్జీ, గౌరీ ప్రసాద్, పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలో జరుగుతున్న రైతన్నా మీకోసం కార్యక్రమం భాగంగా రైతుల సర్వే ను జిల్లా వ్యవసాయ అధికారి వి టి రామారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బలిఘట్టం రైతు సేవ కేంద్రం పరిధిలో ఉన్న రైతులకు రైతన్నా మీకోసం కార్యక్రమం ఉద్దేశ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ పి.సునీత, ఎఒ కెవి రామ్‌ప్రసాద్, ఎఇఒ గణేష్, ఉద్యాన సహాయకుడు రవి ప్రకాష్, విఆర్ఒ రామానుజం రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలో వీలుపరితి గ్రామ సచివాలయం పరిధిలోని రాయుడుపేట, వేపాడ గ్రామాలలో నిర్వహించిన రైతన్నా మీ కోసం గ్రామ సభలను మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, తహశీల్దార్ జె.రాములమ్మ మంగళవారం పరిశీలించారు. ఎఒ స్వాతి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎఇఒ హక్కునాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కోమలి తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని తమ్మిరాయుడుపేట, పాతబగ్గాం, గంగుచోళ్లపెంట, కాలం రాజుపేట, పిడిశిల, మరుపల్లి గ్రామాల్లో మంగళవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. తమ్మిరాయుడుపేటలో నిర్వహించిన అవగాహన సదస్సులో టిడిపి మండల అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాజులరేగ వ్యవసాయ పరిశోధన సంస్థ, ప్రముఖ శాస్త్రవేత్త పి.స్వాతి, ఎఒ కిరణ్‌కుమార్, మరుపల్లి సర్పంచ్ ప్రతినిధి లెంక సత్యనారాయణ, పంచాయతీ సెక్రెటరీ మంత్రి రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎఎంసి చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్ అన్నారు. గర్భాంలో రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా ఇంటింట ప్రచారం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

రామభద్రపురం: వ్యవసాయాన్ని సాంకేతిక విధానాలలో సాగుచేసి అధిక లాభాలు పొందాలని బొబ్బిలి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదనరావు కోరారు. మండల పరిధిలోని నాయుడువలసలో మంగళవారం రైతన్న నీకోసంపై రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివ, రైతులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలి

దెంకాడ: సృజనాత్మక ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలని ఇఎండిపి(ఎంటర్‌ప్రెన్యూరియల మైండ్‌సెట్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్) జిల్లా మేనేజర్ కె.సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం సెషన్-7 సమస్య కనుగొనడం, పరిశీలనపై 9వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, స్వయంగా కొత్త విషయాలను ఆవిష్కరించే సామర్థ్యం వంటి లక్షణాలను అభివృద్ధి చేయడం, భవిష్యత్తులో విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలను సృష్టించే వ్యక్తులుగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ ఆర్.కృష్ణ, ఇఎండిపి ఫెసిలిటేటర్ కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులు పరిశీలన

బొబ్బిలి : పట్టణంలోని గొల్లవీధి శ్రీకృష్ణుని ఆలయం నుంచి శ్మశాన వాటిక వరకూ నూతనంగా నిర్మిస్తున్న మురుగునీటి కాలువ పనులను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను పరిశీలించి బ్లాక్ స్పాట్లను గుర్తించి శుభ్రం చేయాలన్నారు. బ్లాక్ స్పాట్లను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కోరారు. మున్సిపల్ మంచినీటి బావులను క్లోరినేషన్ చేయాలన్నారు. ఆమెతో ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ-2 పి.బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి, విద్యార్థుల హాంవరు బుక్కులను పరిశీలించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ వల్లీ, సిఆర్‌పి రాంప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ

నెల్లిమర్ల: మండలంలోని పారసాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఫర్నీచర్ వితరణగా అందించారు. బూర్లే పైడితల్లి, తర్లాడ శంకర్రావు, సంగం రెడ్డి జగన్నాదం, గొలజాన నారాయణరావు, మీసాల రామగురువులు, సంగం రెడ్డి శ్రీను, గొలజాన సూర్యనారాయణ పాఠశాలకు సుమారు రూ.32వేలు విలువ టేబుల్స్‌ను అందజేశారు. పాఠశాల కళావేదికను సుమారు రూ. 60వేలతో నిర్మించి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను హెచ్ఎం ఎస్.త్రినాధరావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పేదలకు భూములను పంపిణీ చేయాలి

మెంటాడ: మండలంలోని లోతుగడ్డ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 7, 10 లలో సుమారు 30 ఎకరాలు బ్యాటన్ ల్యాండ్‌ను పేదలకు పంపిణీ చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు కోరారు. ఈ మేరకు లోతుగడ్డ మాజీ సర్పంచ్ అగతాన త్రినాద్, పెరుమాల వీరమ్మతో కలిసి తహశీల్దార్ అరుణకుమారికి మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఈ భూముల్లో 25 సంవత్సరాల వయస్సు గల సరుగుడు తోట ఉందని, ఈ భూమికి సంబంధించి పాడి ఇంటి పేరు గల గిరిజన కుటుంబం మరణించడం వల్ల విశాఖ పట్నానికి చెందిన ధనికుడైన ఒక వ్యక్తి ఈ భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేశాడని, ఆ భూమిని నిరుపేదలైన గిరిజన కుటుంబాలకు పంపిణీ చేయాలని కోరారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

దత్తరాజేరు: మండలంలో ఏ గ్రామంలోనైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ జనార్ధన్ హెచ్చరించారు. గతంలో బెల్ట్ షాప్ కేసుల్లో పట్టుబడిన 11 మందిని తహశీల్దార్ హరికిరణ్ ఎదుట మంగళవారం హాజరు పరిచి లక్ష రూపాయల పూచీకత్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వాణకు వేలం పాటల నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఎండి జె.భాష పిబిఎస్‌విఆర్ రాజు పాల్గొన్నారు.

బేస్‌లైన్ అసెస్‌మెంట్ నిర్వహణ

గంట్యాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఫౌండేషనల్ లెటర్స్ న్యూమర్సి అనే అంశాల్లో బేస్‌లైన్ అసెస్మెంట్ నిర్వహిస్తున్నామని డైట్ లెక్చరర్ వాక చిన్నమనాయుడు అన్నారు. మంగళవారం ఆయన లక్కిడాం, గంట్యాడ, కొండతామరాపల్లి పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ డైట్‌లో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు నవదీక్షిత, భారతి, పి.భవాని, సి.భవానీలు, సిఆర్‌పిల సహకారంతో ట్యాబ్ మొబైల్ బెస్ట్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు, ఇంగ్లీషు, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేస్తున్నామన్నారు.

జామి వర్తక సంఘం ఏర్పాటు

జామి: ఎల్లమాంబ మెయిన్ రోడ్డు వర్తక సంఘం సభ్యులు జామిలో వ్యాపారుల వర్తక సంఘం ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం బస్ స్టాండ్ ఆవరణంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సభ నిర్వహించారు. వర్తక సంఘం ప్రెసిడెంట్‌గా దాసరి రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా కొత్తలి ముత్యాల నాయుడు, సెక్రెటరీగా కాపుగంటి రంజిత్ కుమార్, జాయింట్ సెక్రటరీగా రెడ్డి కృష్ణ, కోశాధికారిగా గండి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వర్రి రమణ, ఎంపిటిసి సభ్యులు వాక సుధాకర్, డాక్టర్ అల్లు రాకేష్ 200 మంది షాపుల యజమానులు పాల్గొన్నారు.

ఎపి రజక సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ రజక సేవా సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం సమావేశం జరిగింది. రాష్ట్ర సంఘం వ్యవస్థాపకులు కె .సుబ్బారాయుడు , రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి రామకృష్ణ, పాల్గొన్నారు జిల్లా అధ్యక్షులు ఏలూరు గురుమూర్తి. ఉపాధ్యక్షులుగా రాలి ఈశ్వరరావు, కార్యదర్శిగా సల్లాది అప్పలస్వామి, సహాయ కార్యదర్శిగా గురజాపు శ్రీను, కోశాధికారిగా వెల్దుర్తి రాము, కార్యవర్గ సభ్యులుగా పోలిపల్లి దేముడు, శీల సన్యాసిరావు, తామాడ తౌడు, అచ్చంశెట్టి పాపమ్మ, బొండపల్లి పైడిరాజు, పోలిపల్లి రాంబాబు, కందివలస సీతారాం, ఏలూరు గురు దామోదర్ రావు, ఏలూరు రమణ, ఉమా మహేశ్వరరావు ఎన్నికయ్యారు.

సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవాలి

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష, క్వెస్ట్ ఏలియన్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ కార్యక్రమాన్ని ఎంఇఒ బి.శాంతికుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకొని ఆ అంశాలకు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలకు జోడించి తమ ప్రతిభను చూపాలని సూచించారు. భవిష్యత్తులో విద్యాబోధన కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర కీలకంగా మారుతుందని వాటిని తమ అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ ఉపాధ్యాయులు అదపాక దామోదర రావు, టంకాల సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- దెంకాడ

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. మాదక ద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా భోగాపురం రూరల్ సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై మంగళవారం భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పెద్ద తాడివాడ వద్ద ఉన్న మెరిసి మిషన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద ఈ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేశారని, అలాగే డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజలందరూ పాల్గొని దీనిని కూడా రూపు మాపేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా యువత మేలుకొని డ్రగ్స్‌ను వదులుకొని భవితకు పునాది వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, ఎస్ఐలు ఏ.సన్యాసిరాయుడు, దుర్గాప్రసాద్, టిడిపి, జనసేన నాయకులు పాణిరాజు, పైల శంకర్, కోరాడ రమణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దెంకాడ: ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

యువత డ్రగ్స్ బారిన పడొద్దు

భోగాపురం: యువత డ్రగ్స్ మాయలో పడితే కుటుంబాలు, సమాజం దెబ్బతింటుందని సిఐ కె. దుర్గ ప్రసాద్ హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీసు శాఖ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం భోగాపురానికి చేరింది. సిఐ తన సిబ్బందితో కలిసి స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాయకరావుపేటలో ప్రారంభమైన ఈ యాత్ర నాలుగు జిల్లాల్లో పర్యటించి ఇచ్చాపురంలో ముగియనుందని, మొత్తం 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వి. పాపారావు, ఐ.దుర్గ ప్రసాద్, మారుతి, వికలాంగుల సంఘం అధ్యక్షులు చిన్నారావు, ఎంఇఒ చంద్రమౌళి, జెడ్‌పిటిసి ప్రతినిధి పడాల భాను ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ కొమ్మూరు శుభోసునరావు, ఉదయ్ బాబు, గుండపు సూరిబాబు, పల్లంట్ల జగదీష్, పసుపులేటి లోకేష్, పోలవరపు ప్రకాష్, రౌతు వాసు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ సరఫరా చేయకపోతే వంట చేయలేం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తప్పనిసరిగా గ్యాస్‌తో వంట చేయాలన్న కలెక్టర్ ఆదేశాలతో ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని, ఇలా ఐతే వంట చేయటం సాధ్యం కాదని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మపురి జిల్లా పరిషత్ హై స్కూల్లో కట్టెల పొయ్యి పెడితే వంట చెయ్యనివ్వలేదని , గ్యాస్ పైన వంట చేయాలని ఒత్తిడి చేశారని, ఇలా అయితే నెలకు 15 నుంచి 20 వరకు గ్యాస్ సిలిండర్ లకు హై స్కూల్స్ లో సరాసరి 20 వేలు ఖర్చు అవుతుందని , ఈ డబ్బులు ఎవరు ఇస్తారని సిఐటి యు జిల్లా కోశాధికారి ఎ.జగన్ మోహన్‌రావు ప్రశ్నించారు. నెలల తరబడి బిల్లులు జీతాలు రాకపోయినా అప్పులు చేసి వంట చేసి పిల్లలకు భోజనం పెడుతున్న వంటలమ్మలపై మరింత భారం వేయొద్దని, గ్యాస్ తప్పనిసరి చేయొద్దని తెలిపారు. మంగళవారం ధర్మపురి హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని అక్కడ నిరసన తెలిపి హెచ్ఎమ్‌కు వినతి అందజేశారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం పట్టణం కణపాక రెల్లి వీధికి చెందిన కళ్యాణి రామచంద్రరావు (28) మద్యం మత్తులో మృతి చెందినట్లు వన్ టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి మద్యం తాగుతూ ఇంట్లో స్పృహ తప్పి పడి ఉన్నాడని ఆసుపత్రికి తీసుకువెళ్లగా, పరిస్థితి విషమించి మృతి చెందాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు

అనుమతి లేని మాంసం దుకాణాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని నిర్వహిస్తున్న అనుమతి లేని మాంసం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. మాంసం, చేపలు అమ్మకానికి నిర్దిష్ట అనుమతులు, లైసెన్సులు అవసరమన్నారు. ఈ లైసెన్సులు లేకుండా నిర్వహించడం చట్ట విరుద్ధమన్నారు.

ప్రజలు సహకరించాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల ప్రజలంతా మాదక ద్రవ్య వినియోగ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు పోలీసులకు సహకరించాలని బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లు, వాహనచోదకులకు, విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు పెద్దల ఆధ్వర్యంలో అభ్యుదయం పేరిట మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా చేస్తూ పట్టుబడితే కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అందుకే దీనిని తీవ్ర నేరంగా పరిగణించి ఇటీవల జరిమానాతో పాటు జైలు శిక్షలు కూడా అమలు పరుస్తున్నట్లు తెలిపారు. వాహన చట్టాలు అనుసరిస్తూ రహదారి భద్రతా నియమాలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే పెద్దలకు శిక్షలు వేస్తామని హెచ్చరించారు. అన్ని రోడ్డు ప్రమాదాల నివారణకు త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు, ఏఎస్ఐ అప్పారావు, ట్రైనీ ఎస్ఐ సాయిరాం పడాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

లింగ వివక్షత పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - చీపురుపల్లి

జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా, లింగ వివక్ష, హింస, అసమానతలపై మండల సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నయా చేతన 4.0 మార్పు కోసం ముందడుగు అనే జెండర్ అసమానతలు తొలగించే జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా నాలుగు వారాల పాటు ఈ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఎపిఎం అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 25 నుండి డిసెంబర్ 23 వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల సమైక్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో డిప్యూటీ ఎంపిడిఒ జి.అప్పలనాయుడు, సీసీలు, విఒఎలె, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంకోట: లింగ సమానత్వమే లక్ష్యంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతన చైతన్యం (నయాచేతన్) 4.0 కార్యక్రమం ప్రారంభమైంది. సుమారు నెల రోజులపాటు జరిగే ఈ ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మంగళవారం ఢిల్లీలో వర్చువల్‌గా ప్రారంభించారు. డే ఎన్ఆర్ఎల్ఎం ద్వారా స్వయం సహాయక సంఘాలు, ఇతర ప్రభుత్వం విభాగాలు, వివిధ పౌర సమాజ సంస్థలు (సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్) అనుసంధానంతో ఈ 'నయా చేతన 4.0 మార్పు కోసం ముందడుగు' కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జిల్లా నుంచి ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి, ఎపిడి కె.సావిత్రి, ఎపిడి డి.రత్నాకర్, డిపిఎంలు, ఎపిఎం లతో బాటు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిహెచ్ మాధవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ప్రచార ర్యాలీని నిర్వహించారు.

ర్యాలీ చేస్తున్న ప్రతినిధులు

లైంగిక వేధింపుల నివారణపై శిక్షణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలలపై లైంగిక వేధింపులు నివారణపై ఐసిడిఎస్, విద్యా, ఆరోగ్య, పోలీస్ శాఖ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. బాలలపై లైంగింక వేధింపులు, ఫోక్సో చట్టం, జెజె చట్టం, బాల్యంలో జరిగే ట్రామా అనుభవం, ప్రభావం, పిల్లలను నమ్మించి, మోసం చేసి దగ్గరవ్వడం, సిఎస్ఎను పిల్లలు ఎలా వెల్లడిస్తారు, పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకోవడం వంటి వాటిపై శిక్షనిచ్చారు. శాఖల మధ్య సమన్వయం, కమిట్మెంట్లు, శాఖల పాత్ర, నివేదికలు గూర్చి శిక్షణలో చెప్పారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్.ఉదయ్ కుమార్, ఇన్చార్జ్ ఎంపిడిఒ బివి సుదర్శన్ పట్నాయక్, వైద్యాధికారి బి.పూజ, సి హెచ్ఒ రామారావు, ఎంఇఒలు చంద్రశేఖర్, టి.ధర్మశ్రీ, సోషల్ వర్కర్ వై.శ్రీనివాస్, ఐసిడిఎస్, విద్యా, ఆరోగ్య, పోలీస్ శాఖ సిబ్బంది, టీమ్ సభ్యులు, ఎన్జిఒలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మెరకముడిదాం

శ్రీసత్యసాయి 100 జయంతిని పురస్కరించుకుని జిల్లా అంధ నివారణ సంస్థ, నవజీవన్ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పిహెచ్‌సి ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం విశాఖకు చెందిన శంకర్‌ఫౌండేషన్ నిర్వహించిన ఈ శిబిరంలో 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 52 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని శస్త్ర చికిత్స నిమిత్తం విశాఖపట్నంలో ఉన్న శంకర్ ఫౌండేషన్‌కి తరలించనున్నామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల భాస్కర రాజు, ఎం. కృష్ణమూర్తి రాజు, మెడికల్ ఆఫీసర్ అజిత్ బాబు, సిహెచ్ఒ రామారావు, నవజీవన్ ట్రస్ట్ ప్రతినిధి సాదేం వెంకటరమణ, శంకర్ ఫౌండేషన్ క్యాంప్ ఇంచార్జి సిహెచ్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పరిశ్రమల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలకు చెందిన 9,10,11,12 విద్యార్థులు మంగళవారం జిల్లా కేంద్రంలోని పరిశ్రమలను సందర్శించారు. బాలాజీ మార్కెట్లో గల టెక్స్‌టైల్, క్రాఫ్ట్ బజార్‌ను సందర్శించారని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. ఈ విజిట్‌లో ఒకేషనల్ విద్యార్థులతో పాటు ట్రైనర్ దేవి, సంస్థల వ్యాపారాలు గురించి లాభ నష్టాలు గూర్చి యాజమానులు అడిగి తెలుసుకున్నారు. మహావీర టెక్స్‌టైల్ అధినేత జైకిషన్‌రాణి విద్యార్థులతో మాట్లాడుతూ పరిశ్రమలో ఉద్యోగ అవసర అవకాశాలు ఎలా ఉంటాయి, దుస్తులు ఎక్కడ తయారు చేస్తారు, అసలు ఎక్కడి నుండి దిగుమతి చేసుకుంటారు అనే పలు అంశాలను వివరించారు.

పరిశ్రమల సందర్శనకు వెళుతున్న విద్యార్థినులు

మండల బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి- దెంకాడ

2025 -26, 2026 -2027 సంవత్సరాలకు గాను మండల బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అధ్యక్షతన మంగళవారం మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025 -26 సంవత్సరానికి సవరణ బడ్జెట్ రూ.1.90కోట్లుకు ఆమోదించారు. 2026 - 27 సంవత్సరం అంచనా బడ్జెట్‌ను రూ.1.54కోట్లకు సభ్యులు ఆమోదం దెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వై. భవాని, ఎంపిటిసిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐడిఎ పరిధిలో నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతం (ఐడిఎ) పరిధిలో బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మాణం రంగం 11కెవి లైన్ విస్తరణ, ఆర్‌డిఎస్ఎస్ వ్యవసాయ కనెక్షన్ సర్దేషన్ పనులు, చెట్టు కొమ్మలు తొలగ